‘పశ్చిమ’ను బెస్ట్‌గా చేద్దాం

- చంద్రబాబు హయాంలో అడుగడుగునా దోపిడీ
- పారదర్శక పాలన వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ‘మనతో మన రజినమ్మ’ కార్యక్రమానికి జనం నీరాజనం


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని


వైఎస్సార్‌సీపీలోకి చేరిన మహిళలతో మంత్రి విడదల రజిని

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ధ్వజమెత్తారు. గుంటూరు నగరంలో అంగ రంగ వైభవంగా ‘మనతో మన రజినమ్మ’ కార్యక్రమం కొనసాగుతోంది. 24వ డివిజన్‌లో మంగళవారం మంత్రి రజిని పర్యటించారు. డివిజన్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. వందలాది మంది కార్యకర్తలు, ప్రజల నడుమ పాదయాత్ర చేపట్టారు. వీధి వీధికి వెళ్లి మంత్రి ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు వెస్ట్ నియోజకవర్గాన్ని బెస్ట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కష్ట, నష్టాలతో విలవిల్లాడిపోయారని గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి ఏదైనా సంక్షేమ పథకం పొందాలంటే జన్మభూమి కమిటీల అనుగ్రహం ఉండాలని విమర్శించారు. పార్టీ జెండా కప్పుకుంటేనే పథకాలు అందే పరిస్థితి గతంలో ఉండేదని తెలిపారు. అర్హులైతే చాలు.. సంక్షేమ పథకాలు అందాల్సిందే అన్న నినాదంతో పనిచేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందేలా చేసిన గొప్ప నాయకుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో లంచాలు ఇస్తేనే పథకాలు అందేవని, ఇప్పుడు ఎలాంటి సిఫార్సులు, లంచాలతో పనిలేకుండానే లబ్ధిదారులందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరాన్ని పూర్తిగా విస్మరించారని.. నగరంలోని అన్ని రోడ్లను ధ్వంసం చేసి వదిలేశారని గుర్తుచేశారు. యూజీడీ పనుల వంకతో నగరాన్ని గత ప్రభుత్వంలో సర్వనాశనం చేశారని, పనుల్ని మధ్యలోనే వదిలేసి కోట్లాది నిధుల దుర్వినియోగానికి గత ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. గుంటూరు నగరాన్ని తాము ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే.. గుంటూరును అద్భుతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే బెస్ట్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనలో మహిళా సాధికారతకే తొలి ప్రాధాన్యం

నెహ్రూనగర్: అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని అన్నారు. మంగళవారం గుంటూరు నగరంలోని 21, 25 డివిజన్లకు చెందిన 50 మందికి పైగా మహిళలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో పలువురు తెలుగుదేశం పార్టీలో పలు పదవుల్లో కొనసాగుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సీరాణి ఆధ్వర్యంలో మంగళవారం కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలోకి చేరిన మహిళలు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మంత్రి విడదల రజిని ఈ సందర్భంగా చెప్పారు. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా ఏపీలో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు మేలు జరిగే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. మహిళ బాగుంటేనే ఆమె ఇల్లు బాగుంటుందని, తద్వారా సమాజం, రాష్ట్రం బాగుంటుందని నమ్మి తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలను నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. రూ.51 వేల కోట్లతో 32 లక్షల మందికి పైగా మహిళా లబ్ధిదారులకు ఒకేసారి ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో లబ్ధి దారుల దగ్గర నుంచి స్థానిక టీడీపీ నేతలు ఏ స్థాయిలో కమిషన్లు గుంజారో చూశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని ధ్వజమెత్తారు. తెలుగు మహిళ నాయకులు కొదమల అనిత, రాణి మేరీ, రమాదేవి, ఏసమ్మ, లాజరమ్మ, శాంతి నిర్మల, ఎస్తేరమ్మ, శాంతకుమారి, విజయమ్మ, స్వరూప తదిరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

ఎక్కడా ఓటు లేకపోతేనే కొత్త ఓటు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతన ఓటు కోసం 20ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసున్నారని, తమకు ఎక్కడా ఓటు లేదని వారి నుంచి డిక్లరేషన్ తీసుకున్న తర్వాతనే పరిశీలించి ఓటు కల్పించడం జరుగుతుందని, ఇచ్చిన డిక్లరేషన్ మేరకు సమాచారం వాస్తవం కాకుంటే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం దరఖాస్తు చేస్తున్న ఫారం-6లను ప్రత్యేకంగా బీఎల్‌ఓలు, ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులు పరిశీలించిన రిమార్క్స్‌తోనే తదుపరి ఆమోదం కోసం పంపాలని ఆదేశించారు. డిసెంబర్ 10 తర్వాత తూర్పులో 4 వేలు, పశ్చిమ నియోజకవర్గంలో 2 వేలు ఓటర్ల నుంచి వివిధ క్లైయిమ్స్ అందాయని వాటి పరిష్కారానికి బీఎల్‌ఓల వారిగా రిపోర్ట్ పంపామన్నారు. ఎన్నికల విభాగానికి, రెవెన్యూ శాఖ నుంచి ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్‌లను డెప్యూట్ చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్రస్థాయి పరిశీలనకు బీఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, సూపరింటెండెంట్ సాంబశివరావు, ఎన్నికల విభాగం డీటీ బి.భాస్కరావు, గుర్తింపు పొందిన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి జాన్ బాబు, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి వాసు, బీజేపీ నుంచి భాస్కర్‌రావు, ఆమ్‌ఆద్మీ నుంచి సేవాకుమార్, కాంగ్రెస్ నుంచి జానీబాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంపెనీ సెక్రటరీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్తు

నెహ్రూనగర్: ఆధునిక సమాజంలో మారుతున్న కాలనుగుణంగా కంపెనీ సెక్రటరీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ అమరావతి చాప్టర్ సోము శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం అరండల్‌పేటలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ అమరావతి చాప్టర్, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ)సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ టాక్సెస్, ఎంఎస్‌ఎంఈ డైనమిక్స్, ఆర్టీఫియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ది ఇన్‌స్టిట్యూట్ కంపెనీ సెక్రటరీ జాతీయ అధ్యక్షుడు మనీష్ గుప్తా మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు త్వరితగతిన విద్యాభ్యాసం పూర్తి చేసుకుని జీవితంలో నిలదొక్కుకోవాలంటే కంపెనీ సెక్రటరీ కోర్సులను ఎన్నుకోవాలన్నారు. కంపెనీ సెక్రటరీ కోర్సు చేసిన విద్యార్థుల భవితవ్యం ఉజ్వలంగా ఉంటుందన్నారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం



గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మంగళవారం గుంటూరులో పలు ప్రాంతాల్లో జరిగాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహ కార్యక్రమం జరిగింది. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఫెన్సింగ్ క్రీడలో అఖిల భారత స్థాయి పోటీలకు ఏపీ నుంచి ఎంపికైన క్రీడా కారిణి వి.అంజలికి క్రీడా ఉపకరణాలను కొనుక్కునేందుకు ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు సీదా పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ ద్వారా అందించారు. అందే వెంకటేష్, కొమ్మినేని రవితేజ, మురళీమోహన్, తల్లం శివ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

పట్నంబజారు: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతగుంటూరు బాలాజీనగర్‌లో నివాసం ఉండే కొండేటి రామిరెడ్డి గుంటూరు నాజ్‌సెంటర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుంటారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అమ్మ ఒడికి సంబంధించి డబ్బులు జమ అయ్యాయా అంటూ, లైన్‌లో వలంటీరు ఉన్నారని నమ్మబలికి పలు మార్లు అకౌంట్ పరిశీలించాలని రామిరెడ్డిని అడగ్గా అకౌంట్, ఫోన్‌పేకు సంబంధించి పలు మార్లు ఓపెన్ చేశాడు. దీంతో రామిరెడ్డి ఖాతాలోని రూ. 46వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు నారాకోడూరులో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. జనవరి 11వ తేదీన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.

ఈ శిబిరంలో బజరంగ్ నేత్ర జ్యోతి, బజరంగ్ మీ గుండె పదిలం, బజరంగ్ దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరఫీ సేవలను ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. నేత్రజ్యోతి వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వారం రోజుల్లో ఉచిత కళ్లజోడు అందించటం జరుగుతుందన్నారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియోగ్రాములు తదుపరి గుండె సర్జరీలు చేయించటం, స్టెంట్లు వేయించటం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరైతే దివ్యాంగులున్నారో వారికి ఉచితంగా త్రిచక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడు సమకూర్చటం జరుగుతుందని చెప్పారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు వృద్ధురాలు అగ్ని ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఏసుభక్తనగర్‌లో నివాసం ఉండే మార్తమ్మ (75) ఈనెల 2న చలిమంట వేసుకుని దగ్గరగా మంచవేసుకుని నిద్రించింది. మంటలు ఎగిసిపడి మార్తమ్మపై పడడంతో అగ్ని ప్రమాదం జరిగింది. గమనించిన కుమారుడు శివకాశయ్య, స్థానికులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మార్తమ్మ మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్న విద్యార్థులు


సుమేధ హైస్కూల్లో సంక్రాంతి లక్ష్మిని పూజిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి దంపతులు


వీఎస్సార్ హైస్కూల్లో భోగిమంట వద్ద విద్యార్థులు


జీకేఆర్ హైస్కూల్లో సంప్రదాయ వస్త్రాల్లో విద్యార్థినీ,విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ క్యాంపస్‌లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో భోగి మంట వేసి పండుగ వాతావరణాన్ని తలపింపచేశారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి దంపతులు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి, సంక్రాంతి లక్ష్మిని పూజించారు.

- పట్టాభిపురంలోని జీకేఆర్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో కట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జి. కొండారెడ్డి, ప్రిన్సిపాల్ జి. శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు
- కొత్తపేటలోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో భోగి మంట వేసి, విద్యార్థులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ముంజంపల్లి శివకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కె. బాలకృష్ణ, నవీన్, ఏజీఎం బి. భానుప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మారుతినగర్‌లోని యాపిల్ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ పి.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఏటుకూరురోడ్డులోని వీఎస్సార్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వంగా శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు


విద్యార్థినులతో శ్రీనివాసరావు, రామకృష్ణప్రభు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి సేవా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సంగడిగుంటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ‘మానవత్వాన్ని పెంపొందించు విద్యావశ్యకత’ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ కేటగిరీల్లో విద్యార్థినులు బహుమతులు సాధించారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా విద్యాబోధనలో మానవతా విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారని, అటువంటి అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఏ. శ్రీధర్, సుభద్ర పాల్గొన్నారు.

కత్తితో దాడి.. ఇరువురికి గాయాలు

చేబ్రోలు: బాకీ డబ్బులు వసూలు విషయమై జరిగిన వివాదంలో కత్తితో దాడి చేయటంతో ఇరువురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక చెరువులోపాలెంకు చెందిన మోపర్తి రమేష్‌కు వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన యువకుడితో డబ్బుల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు జీబీసీ రహదారి వద్ద ప్రత్యర్థులు కత్తితో దాడి చేయటంతో మోపర్తి రమేష్‌కు గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన వేమూరి పవన్‌కు గాయాలైనాయి. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీఎంసీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలించిన మేయర్ కావటి మనోహర్


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకల నిర్వహణపై అధికారులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఏడాది నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయని, నగర ప్రజలు సంక్రాంతి సంబరాల ద్వారా తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకునేలా చేశామన్నారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. సంబరాలలో భోగి పళ్లు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు. సంబరాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందరరామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, ప్రజారోగ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

ప్రత్తిపాడు: ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముసాయిదా జాబితాల ప్రచురణ అనంతరం తీసుకుంటున్న చర్యలపై నాయకులకు వివరించారు. ఇప్పటికే జాబితాలను పోలింగ్ కేంద్రాల వద్ద, రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మరొక్కసారి జాబితాలను పరిశీలించుకుని అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు.

ఓటర్ల జాబితాలపై ఏమాత్రం సందేహాలున్నా ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి డాక్టరేట్

గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కృష్ణచైతన్యకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పెదనందిపాడు: ఎరువుల షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడులోని మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, నాగులపాడు జీడీసీఎంస్ కేంద్రాన్ని పెదనందిపాడు, అన్నపర్రు ఆర్బీకే సెంటర్‌లను ఆమె సందర్శించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని, అనుమతి పత్రాలు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా మెయింటెన్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న విధంగా స్టాక్ ఉండాలని ఆమె యాజమానులు, సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బోధన.. కళారాధన

- ఉపాధ్యాయునిగా విద్యాబోధన.. కళారంగంపై మక్కువతో విభావరిల నిర్వహణ
- వృత్తి, ప్రవృత్తిలలో రాణిస్తున్న మేకల పురుషోత్తమ ప్రసాద్


ప్రముఖుల నుంచి సత్కారం పొందుతున్న పురుషోత్తమ ప్రసాద్

పాత గుంటూరు: ఉపాధ్యాయ వృత్తిలో కష్టపడి పనిచేస్తూనే తనకు ఇష్టమైన కళారంగంలో ప్రతిభ కనబరుస్తున్నారు. పిల్లలకు పాఠాలు చెబుతూనే సంగీతాభిమానులను తన పాటలతో అలరిస్తున్నారు మేకల పురుషోత్తమ ప్రసాద్. గుంటూరులోని పోస్టల్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన అమరావతి మండలం జూపూడి గ్రామం ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మేకల పురుషోత్తమ ప్రసాద్ చిన్నప్పటి నుంచి కష్టపడేతత్వాన్ని అలవర్చుకున్నారు. డిగ్రీ అనంతరం బీఈడీ పూర్తిచేసి ఉపాధ్యాయ కొలువును సాధించి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలను బోధిస్తున్నారు. తాను అమితంగా ఇష్టపడే పాటలపై దృష్టిసారించారు. ఖాళీ సమయాల్లో సాధన చేస్తూ చక్కగా పాటలను ఆలపిస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఆయన ప్రదర్శనలిచ్చారు. 2010 సంవత్సరంలో శ్రీ శుభాంజలి కళావేదిక సంస్థను స్థాపించి అన్నదాన సమాజం వేదికగా సుమారు 100 సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. గత నెలలో 12 గంటల పాటు నిర్విరామంగా ఘంటసాల పాటలు ఆలపించడంతో మిరాకిల్స్ వరల్డ్ రికార్డు పొందారు.

సంగీతమంటే ఎంతో ఇష్టం



పిల్లలకు పాఠాలు చెప్పడం, సంగీతాభిమానులను పాటలతో అలరించడం ఎంతో ఇష్టం. ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తూ, సెలవు దినాల్లో సంగీత విభావరిలు నిర్వహించేందుకు సమయాన్ని కేటాయిస్తాను. సంగీతమంటే ఎంతో ఇష్టంగా భావించి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా పేదలను ఆదుకోవడం ఆనందాన్ని కలిగిస్తోంది.

– మేకల పురుషోత్తమ ప్రసాద్, ఉపాధ్యాయుడు

విజ్ఞాన్ విద్యార్థి ప్రతాప్‌రెడ్డికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థి అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ‘ఇన్వెస్టిగేషన్ ఆన్ బాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటినా ఫర్ వైమ్యాక్స్-5జీ-డబ్ల్యూలాన్ అప్లికేషన్స్’ అనే అంశంపై ప్రతాప్‌రెడ్డి పరిశోధన చేశారని తెలియజేశారు. ఆయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అంబవరం ప్రతాప్‌రెడ్డిని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.